# ఇండియన్ పాలిటీ

## రాష్ట్ర శాసనశాఖ

రాజ్యాంగంలోని VIవ భాగంలో 168 నుంచి 212 వరకు ఉన్న అధికరణలు రాష్ట్ర శాసనశాఖ నిర్మాణం, కాలవ్యవధి, స్పీకర్, ఛైర్మన్, ప్రత్యేక హక్కులు మొదలైన వివిధ అంశాలను వివరిస్తాయి.

**శాసనసభ/ విధానసభ:** ఆంధ్రప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రెండు సభలు ఉంటాయి (శాసనసభ/శాసనమండలి) మిగిలిన 22 రాష్ట్రాల్లో ఒకే సభ ఉంటుంది, అది శాసనసభ.

జనాభా ఆధారంగా రాష్ట్రాన్ని ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజిస్తారు. 170వ అధికరణ ప్రకారం రాష్ట్ర శాసనసభలో నియోజకవర్గాల సంఖ్య గరిష్ఠంగా 500, కనిష్ఠంగా 60 ఉంటుంది. పార్లమెంట్ చట్టం ద్వారా 3 రాష్ట్రాలకు (గోవా, మిజోరాం, సిక్కిం), ఒక కేంద్రపాలిత ప్రాంతానికి (పుదుచ్చేరి) కనిష్ఠ సంఖ్య 60 నుంచి మినహాయింపు ఇచ్చారు. (గోవాలో 40 మంది, మిజోరాంలో 40 మంది, సిక్కింలో 32, పుదుచ్చేరిలో 30 మంది సభ్యులు ఉన్నారు). శాసనసభ సభ్యులను రిజిస్టర్డ్ ఓటర్లు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఆంగ్లో ఇండియన్ల జనాభా 2000 కంటే ఎక్కువ ఉన్న 9 రాష్ట్రాల నుంచి ఆ వర్గానికి శాసనసభలో తగిన ప్రాతినిధ్యం లేకపోతే గవర్నర్ ఆ వర్గం నుంచి ఒకరిని శాసనసభకు నియమించవచ్చు. (ఆర్టికల్ 333)

**శాసనమండలి నిర్మాణం:**

రాష్ట్ర శాసనమండలి విభిన్న వర్గాల సమాహారం. రాజ్యాంగంలోని 171వ అధికరణ ప్రకారం శాసనమండలి సభ్యుల సంఖ్య, శాసన సభ్యుల సంఖ్యలో 1/3వ వంతుకు మించకూడదు. అదే సందర్భంలో 40 మందికి తగ్గకూడదు. అయితే కనిష్ఠ సంఖ్య విషయంలో ఉన్న నిబంధన జమ్మూ కశ్మీర్‌కు వర్తించదు. రాజ్యాంగంలోని 171(3) ప్రకారం శాసనమండలి సభ్యుల్లో

ఎ) 1/3వ వంతు మందిని స్థానిక సంస్థల నుంచి (ZPTC, MPTC) ఎన్నుకుంటారు.

బి) 1/12 వ వంతు మందిని రాష్ట్రంలో నివసిస్తూ 3 సంవత్సరాల కిందట పట్టభద్రులై, ఓటరుగా రిజిస్టరైనవారు ఎన్నుకుంటారు.

సి) 1/12వ వంతు మందిని రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్ రంగంలో మాధ్యమిక విద్యాసంస్థలు, అంతకంటే పైస్థాయి విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయ, అధ్యాపక వర్గం ఎన్నుకుంటుంది. అయితే ఓటు హక్కు పొందడానికి కనీసం 3 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి ఉండాలి.

పైన తెలిపిన స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాలు పార్లమెంట్ నిర్ణయించిన ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా సభ్యులను ఎన్నుకుంటాయి.

డి) శాసనసభ 1/3వ వంతు సభ్యులను నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో (శాసనసభలో రాజకీయ పార్టీల సంఖ్యా బలం ఆధారంగా) ఏక ఓటు బదిలీ విధానం ప్రకారం ఎన్నుకుంటారు. దీనికి నిర్ణయించిన 'కోటా' ఓట్లు పొందాల్సి ఉంటుంది.

మిగిలిన 1/6వ వంతు మందిని 171(3)e ప్రకారం, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, కళలు, సహకార ఉద్యమం, సామాజిక సేవ మొదలైన రంగాల నుంచి గవర్నర్ నియమిస్తారు.

శాసనసభ లేదా విధానసభకు, శాసనమండలి లేదా విధానమండలికి నిర్మాణంలోనే కాకుండా అధికారాల్లో అనేక తేడాలు ఉంటాయి.

★ ఆర్థిక బిల్లులను మొదట తప్పనిసరిగా శాసనసభలోనే ప్రవేశపెట్టాలి. అంతేకాకుండా శాసనమండలి 14 రోజుల్లోపల ఆమోదించాలి లేదా సవరణలతో శాసనసభకు పంపాలి. ఈ సవరణలను శాసనసభ ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. 14 రోజుల్లోగా ఆమోదించినా, ఆమోదించకపోయినా, ఆమోదం పొందినట్లుగా భావించి బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపుతారు.

★ ఒక బిల్లు ఆర్థిక బిల్లా లేదా సాధారణ బిల్లా అని నిర్ణయించే ప్రత్యేక అధికారం శాసనసభ స్పీకర్‌కు ఉంటుంది. శాసనమండలికి ఈ విషయంలో అధికారం లేదు.



R-28-11-18

★ సాధారణ బిల్లు మొదటిసారి తన వద్దకు వచ్చినప్పుడు శాసనమండలి గరిష్ఠంగా 3 నెలలు, అదే బిల్లు రెండోసారి వచ్చినప్పుడు గరిష్ఠంగా ఒక నెల, మొత్తం కేవలం 4 నెలలు మాత్రమే ఆలస్యం చేయగలదు. అంతకు మించితే శాసనమండలి ఆమోదించినా, ఆమోదించకపోయినా ఆమోదించినట్లే భావించి, గవర్నర్ ఆమోదం కోసం పంపుతారు.

★ ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రిమండలిపై అవిశ్వాస తీర్మానాన్ని శాసనసభలోనే ప్రవేశపెట్టాలి. ఇందులో శాసనమండలికి ఎలాంటి అధికారం లేదు.

★ శాసనమండలి బడ్జెట్‌కు సంబంధించిన గ్రాంట్ల కోసం డిమాండ్‌లను చర్చించగలదు. అంతేగానీ శాసనసభలో మాదిరిగా ఓటు వేసే హక్కు ఉండదు.

★ సాధారణ బిల్లును మొదట శాసనమండలిలో ప్రవేశపెట్టి, ఆమోదం పొందిన తర్వాత శాసనసభ ఆ బిల్లును తిరస్కరిస్తే రద్దవుతుంది. సాధారణ బిల్లుల విషయంలో కూడా శాసనసభదే తుది నిర్ణయం.

★ రాజ్యాంగ సవరణలో శాసనసభకు మాత్రమే భాగస్వామ్యం ఉంటుంది, శాసనమండలికి లేదు.

★ రాజ్యసభ సభ్యుల ఎన్నికలో శాసనసభకు మాత్రమే అధికారం ఉంది. మండలికి ఉండదు.

★ రాష్ట్రపతిని ఎన్నుకునే 'నియోజకగణం'లో శాసన సభ్యులు (ఎన్నికైన) మాత్రమే పాల్గొంటారు. శాసన మండలి సభ్యులకు రాష్ట్రపతి ఎన్నికలతో సంబంధం లేదు.

★ శాసనమండలి ఏర్పాటు, కొనసాగింపు, రద్దు శాసనసభ సిఫారసుపై ఆధారపడి ఉంటాయి. కానీ శాసనసభ ఏర్పాటు తప్పనిసరి. దీనిపై శాసనమండలికి ఎలాంటి ఆధిపత్యం లేదు.

★ శాసనసభను ముఖ్యమంత్రి సిఫారసుపై గవర్నర్ రద్దు చేయగలరు, కానీ శాసనమండలిని రద్దు చేయలేరు.

**విధానసభ స్పీకర్:**

రాజ్యాంగంలోని 178వ అధికరణ ప్రకారం రాష్ట్ర విధానసభ లేదా శాసనసభ సభ్యులు తమలో ఒకరిని స్పీకర్‌గా, మరొకరిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకుంటారు.

★ 179వ అధికరణ ప్రకారం శాసనసభను రద్దు చేస్తే శాసనసభ్యుల సభ్యత్వం రద్దు అయినప్పటికీ స్పీకర్ మాత్రం ఎన్నికల తర్వాత శాసనసభ మొదటి సమావేశం జరిగే వరకు కొనసాగుతారు.

★ శాసనసభ స్పీకర్‌ను తొలగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టినప్పుడు 181వ అధికరణ ప్రకారం సభకు హాజరుకావచ్చు, తన అభిప్రాయాన్ని తెలపవచ్చు, తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొనవచ్చు, కానీ నిర్ణాయక ఓటు హక్కు ఉండదు. సభకు అధ్యక్షత వహించకూడదు.

**శాసనమండలి ఛైర్మన్:**

రాజ్యాంగంలోని 182వ అధికరణ ప్రకారం విధాన మండలి సమావేశాలకు ఛైర్మన్ లేదా డిప్యూటీ ఛైర్మన్ అధ్యక్షత వహిస్తారు. శాసన మండలి సభ్యులు తమలో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లను కూడా స్పీకర్/డిప్యూటీ స్పీకర్‌ను తొలగించినట్లే సాధారణ మెజారిటీతో ఒక తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

కేంద్రంలో మాదిరిగా రాష్ట్రాల్లో శాసనమండలి ఏర్పాటు తప్పనిసరి కాదు. అంతేకాకుండా బ్రిటిష్ పార్లమెంట్ చట్టం 1911లో సూచించినట్లు శాసనమండలికి సలహా కోసం గరిష్ఠంగా రెండుసార్లు పంపవచ్చు. అయితే శాసనసభ, శాసనమండలి మధ్య ఘర్షణకు అవకాశం లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను కాపాడటంలో, విలువైన సూచనలు ఇవ్వడంలో శాసన మండలికి చాలా ప్రాధాన్యం ఉంటుంది.

## రాజ్యసభ - శాసనమండలి మధ్య తేడాలు

పార్లమెంట్‌లో ఎగువసభ అయిన రాజ్యసభకు, రాష్ట్ర శాసనసభలో ఎగువసభ అయిన శాసనమండలికి నిర్మాణం, అధికారాల్లో అనేక తేడాలు ఉన్నాయి

★ రాజ్యసభ శాశ్వత సభ. దాన్ని రద్దు చేయడానికి ఎవరికీ అధికారం లేదు, కానీ శాసనమండలిని శాసనసభ సిఫారసుపై పార్లమెంట్ రద్దు చేయగలదు లేదా ఏర్పాటు చేయగలదు.

★ రాజ్యసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాష్ట్ర శాసనమండలి రాష్ట్రంలోని విభిన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది (స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో ప్రసిద్ధి పొందినవారు)

★ లోక్‌సభ ఆమోదించిన సాధారణ బిల్లులను రాజ్యసభ తిరస్కరిస్తే ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంది. కానీ శాసనసభ ఆమోదించిన బిల్లును శాసనమండలి తిరస్కరించినప్పటికీ ఉభయ సభల సంయుక్త సమావేశానికి అవకాశం లేదు. విధానమండలికి కేవలం సలహా అధికారం మాత్రమే ఉంటుంది.

★ రాజ్యసభకు ఆర్థిక బిల్లులు మినహా మిగిలిన బిల్లుల విషయంలో లోక్‌సభతో సమాన అధికారాలు ఉన్నాయి. కానీ ఆర్థిక బిల్లుల విషయంలోనే కాకుండా సాధారణ బిల్లుల విషయంలో కూడా శాసనసభ నిర్ణయమే అంతిమం.

★ రాజ్యాంగ సవరణలో లోక్‌సభతో పాటు ఎగువసభ అయిన రాజ్యసభకు సమాన అధికారాలుండగా, రాష్ట్రంలో రాజ్యాంగ సవరణలో శాసనసభకు మాత్రమే అధికారం ఉంది, శాసనమండలికి లేదు.

ఈ విధంగా రాజ్యసభ, శాసనమండలి రెండూ ఎగువసభలే అయినప్పటికీ అవిశ్వాస, విశ్వాస తీర్మానాలు, ఆర్థిక బిల్లుల విషయంలో మినహా ఏ ఇతర విషయంలోనూ రాజ్యసభను కాదని లోక్‌సభ ఏకపక్షంగా వ్యవహరించలేదు. కానీ రాష్ట్రంలో శాసనసభ ఏ విషయంలోనైనా శాసనమండలి అభిప్రాయానికి విరుద్ధంగా కూడా వ్యవహరించగలదు.

## గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

**1.** రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయడం ద్వారా విధాన పరిషత్‌ను లేదా శాసనమండలిని రద్దు చేయాలంటే?

(UPSC Civils Prelims - 2010)

1) శాసనసభకు హాజరై ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యుల్లో మెజారిటీ 2/3వ వంతు కంటే తగ్గకూడదు.

2) శాసనసభకు హాజరైన ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యుల్లో 1/3వ వంతు కంటే మెజారిటీ తగ్గకూడదు.

3) శాసనసభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ హాజరై ఓటింగ్‌లో పాల్గొని 2/3వ వంతు మెజారిటీ కంటే తగ్గకుండా తీర్మానిస్తే శాసనమండలి రద్దవుతుంది.

4) శాసనసభ సాధారణ మెజారిటీతో శాసనమండలి రద్దవుతుంది.

**2.** కిందివాటిలో ఏ విధానసభలో అత్యంత తక్కువ మంది సభ్యులు ఉన్నారు? (APPSC, APBC, Social, Tribal Welfare officer, Mains 2017)

1) మిజోరాం 2) పుదుచ్చేరి 3) గోవా 4) సిక్కిం

**3.** ఏ రాష్ట్ర విధానసభలోనైనా అత్యధికంగా ఎంతమంది సభ్యులు ఉండవచ్చు? (ఏపీపీఎస్సీ పంచాయతీ సెక్రటరీ పేపర్-1, 2017)

1) 400 2) 425 3) 500 4) 545

**4.** భారతదేశంలో ఎన్ని రాష్ట్రాల్లో ద్వంద్వ సభలు ఉన్నాయి?

1) 5 2) 6 3) 7 4) 4

**5.** ఏ రాష్ట్ర శాసనసభలోనైనా ఉండాల్సిన కనీస స్థానాల సంఖ్య?

1) 40 2) 50 3) 60 4) కనీస సంఖ్య ఏదీ లేదు

**సమాధానాలు:** 1-3; 2-2; 3-3; 4-3; 5-3.

**రచయిత: డాక్టర్ ముప్పాల భాస్కర రాజు**